సాక్షి
నిజామాబాద్
బుధవారం । 3 । జూలై । 2024



భారీగా గంజాయి పట్టివేత

రెండు వేర్వేరు కేసుల్లో 3.30 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు తెలిపారు.

- 8లో ▸



నిర్లక్ష్యపు హెచ్‌ఎం మాకొద్దు

ప్రభుత్వ పాఠశాలలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హెచ్‌ఎం మాకొద్దంటూ ఠాణాకలాన్ గ్రామస్తులు ఆందోళన చేపట్టారు.

- 8లో ▸

వాతావరణం


గరిష్ఠం/కనిష్ఠం
32.8 /25.8

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

అల హస్తినాపురంలో..

సీఎం రేవంత్ మరోసారి ఢిల్లీ వెళ్లనున్న నేపథ్యంలో పీసీసీ అధ్యక్షుడి పేరు, మంత్రివర్గంలో బెర్త్ ఖరారు విషయంలో రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది. పీసీసీ పీఠం రేసులో ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్, కేబినెట్ బెర్త్ రేసులో ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి ముందున్నారు. కాంగ్రెస్ అధిష్టానం సైతం వీరికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

- మరికొన్ని గంటల్లో పీసీసీ అధ్యక్షుడిని ప్రకటించనున్న ఏఐసీసీ!
- ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ పేరు దాదాపు ఖరారు
- మరోవైపు మంత్రివర్గ విస్తరణకు సైతం అధిష్టానం గ్రీన్‌సిగ్నల్
- సుదర్శన్‌రెడ్డికి దక్కనున్న కేబినెట్ బెర్త్!
- నేడు మరోసారి సీఎం రేవంత్ ఢిల్లీ వెళ్లనుండడంతో సర్వత్రా ఆసక్తి



ఢిల్లీలో ఖర్గేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మహేశ్‌కుమార్ గౌడ్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: తెలంగాణ పీసీసీకి కొత్త అధ్యక్షుడి నియామకం, రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ విషయమై గత రెండు వారాలుగా ఢిల్లీలో పార్టీ అధిష్టానంతో పలు విడతల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుదీర్ఘ మంతనాలు చేస్తూ వస్తున్నారు. రాష్ట్రానికి సంబంధించి కీలకమైన వ్యవహారాల విషయమై ఏఐసీసీ సుదీర్ఘ కసరత్తులు చేస్తోంది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ తాజాగా మరోసారి ఢిల్లీ వెళ్లనున్నారు. పీసీసీ అధ్యక్షుడి పేరు, మంత్రివర్గ బెర్త్‌లు దక్కనున్న వారి పేర్లను అధిష్టానం మరికొన్ని గంటల్లో ఫైనల్ చేయనున్నట్లు తెలుస్తోంది.

నిజామాబాద్‌కు చెందిన ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ పీసీసీ అధ్యక్ష పీఠం రేసులో అందరికంటే ముందున్నారు. మరోవైపు మొదటిదశ కేబినెట్ బెర్తుల కేటాయింపులో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు ప్రాతినిధ్యం కల్పించలేదు. దీంతో తదుపరి మంత్రివర్గ విస్తరణలో నిజామాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం కల్పించనున్నారు. కేబినెట్ బెర్త్ రేసులో పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి ముందున్నారు. సుదర్శన్‌రెడ్డి పేరు ఖరారైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సుదర్శన్‌రెడ్డికి కేటాయించనున్న శాఖల విషయమై ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

పీసీసీ పీఠం, కేబినెట్ బెర్త్ విషయంలో ఢిల్లీలో సీఎం సుదీర్ఘ మంతనాలు చేస్తుండడం, ఇందులో నిజామాబాద్ జిల్లా నేతలే రేసులో ముందుండడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

■ పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి కేబినెట్ పదవి ఖరారైనట్లు ఢిల్లీ సర్కిల్స్ నుంచి తెలుస్తోంది. అదేవిధంగా ముఖ్యమంత్రి సైతం సుదర్శన్ రెడ్డికి మంత్రిపదవి కేటాయించే విషయమై ఆసక్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఏఐసీసీ సైతం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో సుదర్శన్‌రెడ్డికి ఏ శాఖలు కేటాయిస్తారనే అంశంపై జిల్లాలో ఆసక్తికర చర్చ నడుస్తోంది. విద్యాశాఖ లేదా హోం, శాంతిభద్రతల విభాగాల శాఖలు గానీ సుదర్శన్‌రెడ్డికి కేటాయించనున్నట్లు వివిధ వర్గాల్లో ఊహాగానాలు సాగుతున్నాయి. మరోవైపు శాఖల కేటాయింపు విషయమై మార్పులు, చేర్పులు చేసిన పక్షంలో సుదర్శన్‌రెడ్డికి పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖలు కేటాయిస్తారనే చర్చ సైతం నడుస్తోంది. మరికొన్ని గంటల్లోనే ఉత్కంఠకు తెరపడనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

■ పీసీసీ అధ్యక్ష పదవి రేసులో ముందున్న ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ విద్యార్థి దశలోనే ఎన్‌ఎస్‌యూఐలో తన రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టారు. అనేక కీలక పదవులు నిర్వహిస్తూ వచ్చిన మహేశ్‌కుమార్ గౌడ్ ప్రస్తుతం పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్గనైజేషన్ వ్యవహారాలను పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేస్తూ వస్తున్నారు. గత శాసనసభ ఎన్నికల సమయంలో మహేశ్‌కుమార్ గౌడ్ అహర్నిశలు పార్టీ వ్యవహారాలు పర్యవేక్షించారు. దీంతో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డిపై చాలావరకు భారం తగ్గింది. రేవంత్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రచారంలో విస్తృతంగా తిరిగారు. ఈ క్రమంలో అధికారం చేజిక్కింది. ఈ నేపథ్యంలో మహేశ్‌కుమార్ గౌడ్‌కు పీసీసీ పీఠం అప్పగించే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ మద్దతుగా నిలుస్తున్నారు. అదేవిధంగా ఏఐసీసీ నాయకత్వంతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్న మహేశ్‌గౌడ్ ఆర్గనైజేషన్ వ్యవహారాలు నడిపించడంలో దిట్టగా పేరు తెచ్చుకున్నారు. దీంతో ఏఐసీసీ నాయకత్వం మహేశ్‌గౌడ్ వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. దక్షిణ తెలంగాణ నుంచి రెడ్డి వర్గానికి చెందిన రేవంత్ సీఎంగా ఉండడంతో, ఉత్తర తెలంగాణకు చెందిన బీసీ సామాజిక వర్గానికి చెందినవారు కావడంతో మహేశ్‌గౌడ్‌కు అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఢిల్లీ నుంచి వచ్చే ప్రకటన కోసం అందరూ ఎదురు చూస్తున్నారు.

ముగియనున్న పరిషత్ పాలన

- జిల్లా పరిషత్ పదవీకాలం రేపటితో ముగింపు
- కలెక్టర్‌కు జెడ్పీ ఛైర్మన్ బాధ్యతలు ?
- మండలాలకు ఇన్‌చార్జి అధికారులు



నిజామాబాద్‌రూరల్: జిల్లాలో జిల్లా, మండల పరిషత్‌ల పదవీకాలం రేపటితో ముగియనుంది. దీంతో ఇక ప్రత్యేకాధికారుల పాలన రానుంది. ఇప్పటికే సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో ఇన్‌చార్జి అధికారులను నియమించారు. ప్రభుత్వం ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే యోచనలో లేకపోవడంతో పరిషత్‌లకు కూడా ప్రత్యేకాధికారులను నియమించనున్నట్లు తెలుస్తోంది. అయితే ఇందుకు సంబంధించిన పూర్తి సమాచారం బుధవారం తెలుస్తుందని జెడ్పీ సీఈవో తెలిపారు. గురువారంతో నాటితో జిల్లా ప్రజాపరిషత్ చైర్మన్ పదవీకాలం కూడా ముగినుండడంతో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆ బాధ్యతలు చేపడతారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. 2019 మేలో ఎంపీటీసీతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వహించింది. జూన్ చివరి వారంలో జిల్లా పరిషత్ చైర్మన్‌గా దాదాన్నగారి విఠల్‌రావు బాధ్యతలు చేపట్టారు. మొత్తం జిల్లాలో 27 మంది జెడ్పీటీసీలు ఉండగా, 299 మంది ఎంపీటీసీల పదవీకాలం ముగియనుంది. గత ఐదేళ్లలో జిల్లా పరిషత్ చైర్మన్ అధ్యక్షతన 29 సాధారణ సర్వసభ్య సమావేశాలు నిర్వహించారు.

మండలాలకు ఇన్‌చార్జీలు

జిల్లాలోని 27 మంది ఎంపీపీలు, జెడ్పీటీసీల పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం వారి స్థానాల్లో ప్రత్యేకాధికారులను నియమించేందుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం విధివిధానాలపై జెడ్పీ సీఈవో ఉష ఇది వరకే ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు సమాచారం. మండలాలకు సంబంధించిన ప్రత్యేక అధికారుల నియామకంపై పూర్తిస్థాయిలో బుధవారం కలెక్టర్, ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయనున్నారు.

అరకొరగా నిధుల మంజూరు

జిల్లా పరిషత్‌లో ప్రస్తుతం ఉన్న ఎంపీపీలకు, జెడ్పీటీసీలకు 14, 15 ఆర్థిక సంఘం నిధులు, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నిధులు ఆశించిన విధంగా రాలేదని.. మండలాల్లో సమస్యలు అలాగే ఉన్నాయని సభ్యులు గతంలో జరిగిన సర్వసభ్య సమావేశాల్లో పేర్కొన్నారు. ముఖ్యంగా అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, నూతన రేషన్ కార్డులు, పెన్షన్లు, ప్రజల మౌలిక సదుపాయాలు వంటి సమస్యలను అప్పట్లో అధికారంలో ఉన్న ఎంపీపీలు, జెడ్పీటీసీలు అనేక సార్లు చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు.

బదిలీ అయినా రిలీవ్ చేయడం లేదు!

నిజామాబాద్‌అర్బన్: జిల్లా విద్యాశాఖలో ఇటీవల బదిలీల ప్రక్రియ సజావుగా ముగిసింది. మొత్తం 1,321 మందికి బదిలీలు జరిగాయి. లాంగ్వేజ్ పండిత్‌లకు సైతం బదిలీల ప్రక్రియ చేపట్టగా కొత్త ప్రాంతాల్లో రిపోర్టు చేయడానికి రిలీవింగ్ ఇబ్బందికరంగా మారింది. పలు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులను రిలీవ్ చేయడం లేదు. వారి స్థానంలో టీచర్లు వస్తేనే రిలీవ్ చేస్తామని చెబుతున్నారు. దీంతో జిల్లాలో చాలామంది టీచర్లు బదిలీ అయినా కూడా పాత స్థానాల్లోనే ఉండిపోయారు. వేరేవాళ్లు వచ్చేవరకు ప్రధానోపాధ్యాయులు రిలీవ్ చేయడం లేదు. బదిలీ అయిన కొత్త స్థానానికి వెళ్లడానికి ఇబ్బందికరంగా మారింది. జిల్లాలో ఇలా 80 శాతం మంది బదిలీ అయిన ఉపాధ్యాయులు రిలీవ్ కాకపోవడంతో పాత పాఠశాలలోని కొనసాగుతున్నారు. బదిలీ అయిన స్థానంలో మరొకరిని భర్తీ చేయాలంటే ఇప్పట్లో సాధ్యమయ్యే పరిస్థితులు లేవు. అయితే కొత్తగా పోస్టుల భర్తీ చేపట్టాలి. లేదంటే అదే ప్రాంతంలో మరొకరు బదిలీపై రావాలి కానీ కొన్నిచోట్ల ఇతరులు వచ్చినా కూడా మరికొన్ని ప్రాంతాల్లో ఖాళీలు ఏర్పడుతున్నాయి. ఈ ఖాళీల కారణంగా ప్రధాన ఉపాధ్యాయులు టీచర్లను రిలీవ్ చేయడానికి వెనుకంజ వేస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు చొరవ తీసుకొని బదిలీ అయిన వారిని రిలీవ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

న్యూస్‌రీల్

ధ్రువపత్రాల పరిశీలన



తెయూ(డిచ్‌పల్లి): దోస్త్ ఆన్‌లైన్ డిగ్రీ ప్రవేశానికి 2024–25 విద్యాసంవత్సరానికి గాను రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రత్యేక కేటగిరి విద్యార్థుల ధ్రువపత్రాలను మంగళవారం పరిశీలించారు. తెయూ పరిపాలనా భవనంలోని అకడమిక్ ఆడిట్ సెల్ విభాగంలో పీహెచ్‌సీ(దివ్యాంగులు)–3, సీఏపీ–2, ఎన్‌సీసీ–6, ఎక్స్‌ట్రా కరిక్యులర్ ఆక్టివిటీస్–1 విద్యార్థితో కలిపి మొత్తం 12 మంది విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలించినట్లు దోస్త్ కో–ఆర్డినేటర్ కె సంపత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది రవీందర్‌నాయక్, నరేశ్, బీఆర్‌నేత తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ వన్‌టైం పరీక్షల్లో 22 మంది గైర్హాజరు



తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని డిగ్రీ వన్‌టైం పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణకు వర్సిటీ పరిధిలో నిజామాబాద్, ఆర్మూర్, కామారెడ్డి, బాన్సువాడ మొత్తం 4 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు మొత్తం 203 మంది విద్యార్థులకు 181 మంది హాజరు కాగా 22 మంది గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పరీక్షలు నిర్వహించాలని ఇన్విజిలేటర్లకు సూచించారు.

పరీక్షల షెడ్యూల్‌లో మార్పు

తెయూ పరిధిలో మంగళవారం ప్రారంభమైన డిగ్రీ వన్‌టైం ఛాన్స్ పరీక్షల షెడ్యూల్‌లో కొన్ని మార్పులు చేసినట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సులకు సంబంధించి 5, 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు ఈ నెల 25 నుంచి ఆగస్టు 4వరకు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కంట్రోలర్ సూచించారు.

పిల్లలు నైతికంగా అభివృద్ధి సాధించాలి

- డీడబ్ల్యూవో రసూల్‌బీ



నిజామాబాద్‌రూరల్: పిల్లలు నైతికంగా అభివృద్ధి సాధించాలని డీడబ్ల్యూవో రసూల్‌బీ పేర్కొన్నారు. మండలంలోని గూపన్‌పల్లిలోని రామకృష్ణ ధ్యాన మందిరంలో మూడు రోజుల శిక్షణలో భాగంగా నూతన జాతీయ విద్యావిధానం రివైజ్డ్ ప్రీస్కూల్ కరికులంపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంపూర్ణ వికాసవంతమైన పిల్లలుగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైనర్ ప్రియదర్శిని, సూపర్‌వైజర్ రమాదేవి, సీడీపీవో నందిని, సిబ్బంది స్వరూప, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జెడ్పీ ఛైర్మన్‌ను సన్మానించిన కేసీఆర్



నిజామాబాద్ రూరల్: జిల్లా పరిషత్ ఛైర్మన్ దాదాన్నగారి విఠల్‌రావు మంగళవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో జెడ్పీ చైర్మన్లు, వారి కుటుంబ సభ్యులతో మంగళవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో నిజామాబాద్ జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు కుటుంబ సభ్యులతో సహా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జెడ్పీ చైర్మన్‌ను కేసీఆర్ శాలువాతో సన్మానించారు.

పెరుగుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం

- శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 4,630 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్ జలాశయంలోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీ ప్రాజెక్టులోకి 4,630 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఒక్క రోజు వ్యవధిలోనే 0.30 అడుగుల నీటి మట్టం పెరిగింది. ప్రాజెక్టు నుంచి సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 224 క్యూసెక్కుల నీరుపోతుంది. కాగా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 1060.30 అడుగుల(10.83టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.

ఈ సీజన్‌లో 4.6 టీఎంసీలు..

ప్రాజెక్టులో ప్రస్తుత సంవత్సరం జూన్ 1 నుంచి ఇప్పటి వరకు ఎగువ ప్రాంతాల నుంచి 4.6టీఎంసీల వరద నీరు వచ్చి చేరినట్లు రికార్డులు తెలుపుతున్నాయి. ఇందులో స్థానిక ఎగువ ప్రాంతాల నుంచి 4.2 టీఎంసీలు కాగా బాబ్లీ గేట్లు ఎత్తడంతో మహారాష్ట్ర నుంచి 0.4 టీఎంసీల నీరు వచ్చి చేరినట్లు ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు. ఎస్సారెస్పీకి అధిక వరద నీరు మహారాష్ట్ర నుంచే ఉండడంతో ప్రాజెక్టులోకి ఇక నుంచి వరద నీరు వచ్చిచేరుతుందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

'రైతు భరోసా'పై అభిప్రాయ సేకరణ

- రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్న సొసైటీలు
- చేసిన తీర్మానాలను ప్రభుత్వానికి పంపనున్న అధికారులు
- పెట్టుబడి సాయాన్ని పరిమితం చేయాలంటున్న మెజారిటీ రైతులు



డొంకేశ్వర్ సొసైటీలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న రైతులు

డొంకేశ్వర్(ఆర్మూర్): ప్రస్తుతం వానాకాలం సీజన్ నుంచే రైతులకు పంట పెట్టుబడి సాయాన్ని(రైతు భరోసా) అందజేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అభిప్రాయ సేకరణ చేపట్టింది. ఇందుకు జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ప్రత్యేకంగా రైతులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. రైతుభరోసాపై సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాగులో లేని వ్యవసాయ భూములకు సైతం పెట్టుబడి సాయాన్ని అందజేసిన సంగతి తెలిసిందే. అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పంట పెట్టుబడిని పరిమితం చేయాలని భావిస్తోంది. అయితే ఆయా మండలాలు, గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో రైతుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రైతు భరోసాను ఐదెకరాల్లోపు వారికి ఇవ్వాలని కొంతమంది, పదెకరాల వరకు కూడా వర్తింపజేయాలని మరికొంతమంది రైతులు అభిప్రాయాలను తెలుపుతున్నారు. ఇన్ని ఎకరాలకు అని కాకుండా ఎన్ని ఎకరాలు సాగు చేస్తే అన్ని ఎకరాలకు పెట్టుబడి సాయాన్ని అందించాలని ఇంకొందరు రైతులు చెబుతున్నారు. కాగా కొన్నిచోట్ల కౌలు చేస్తున్న రైతుల ఖాతాల్లోకే పెట్టుబడిని అందించాలని కోరుతున్నారు. మెజారిటీ రైతులు మాత్రం 'రైతు భరోసా'ను పరిమితం చేయాలని కోరుతుండడం ప్రభుత్వానికి కలిసివచ్చే విషయమని చెప్పవచ్చు. ప్రభుత్వం కూడా ఇదే అంశాన్ని పరిగణనలోకి తీసుకుని చిన్న, సన్నకారు రైతులకు పంట పెట్టుబడిని అందించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే ప్రభుత్వానికి కూడా బోలెడంత ఖర్చు తగ్గనుంది. అయితే, సమావేశంలో చర్చకు వచ్చిన విషయాలను సొసైటీలు తీర్మానం చేస్తున్నాయి. సహకార శాఖ అధికారులు తీర్మానాలన్నింటినీ క్రోడీకరించి 15 రోజుల్లో ప్రభుత్వానికి నివేదించనున్నారు.

అభిప్రాయ సేకరణ సరైందే..



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు అధికారంలోకి రాగానే రైతు భరోసా కింద పంట పెట్టుబడి సాయాన్ని అందించడానికి చర్యలు చేపట్టింది. దీనిని అమలు చేసే ముందు రైతులతో అభిప్రాయ సేకరణ చేపట్టడం సరైందే. మెజారిటీ రైతులు చెప్పినదానినే ప్రభుత్వం పరిగణలోకి రైతు భరోసాను అందించాలి.

– గొడిసెరం భూమేశ్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు, డొంకేశ్వర్

అర్హులకు నష్టం జరగకుండా చూడాలి



రైతు భరోసా అందించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన రైతులను గుర్తించాలి. సాగుచేసే వారందరికీ పెట్టుబడి సాయం అందించాలి. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు నష్టం జరగకుండా చూస్తే బాగుంటుంది. ఖరీఫ్ సాగు పనులు మొదలైనందున త్వరగా రైతుల ఖాతాల్లో డబ్బులు చేయాలి.

– సుంకరి నాగరాజు, రైతు, డొంకేశ్వర్

నేతలిద్దరూ ఒక్కటయ్యారు!

- నిన్నటి వరకు ప్రత్యర్థులు.. నేడు మిత్రులు
- కలిసిపోయిన పోచారం, కాసుల వర్గాలు
- ఏనుగు వర్గం దారెటన్న అంశంపై కాంగ్రెస్‌లో చర్చ

సాక్షి, కామారెడ్డి: రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వతమిత్రులు ఎవరూ ఉండరన్నది అక్షరసత్యం. బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గంలో నిన్నటివరకు ప్రత్యర్థులుగా ఉన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాసుల బాలరాజులు కలిసిపోవడం దీనికి నిదర్శనంగా చెబుతున్నారు. వీరిద్దరు సుమారు పదిహేనేళ్లుగా రాజకీయ ప్రత్యర్థులు. 2009 ఎన్నికల్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డి టీడీపీ తరఫున బరిలో నిలవగా కాసుల బాలరాజు ప్రజారాజ్యం అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో పోచారం విజయం సాధించారు. 2014లో పోచారం బీఆర్‌ఎస్ అభ్యర్థిగా, బాలరాజు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీలో నిలిచారు. ఆ ఎన్నికల్లోనూ పోచారందే పైచేయి అయ్యింది. 2018లోనూ వీరిద్దరి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. బాలరాజును పోచారం వరుసగా మూడోసారి ఓడించారు. 2023 ఎన్నికల్లోనూ కాంగ్రెస్ నుంచి పోటీ చేయడానికి కాసుల ప్రయత్నించగా.. చివరి నిమిషంలో టికెట్టు ఏనుగు రవీందర్‌రెడ్డిని వరించింది. అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో అధిష్టానం బాలరాజుకు రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చింది. ఇటీవల జరిగిన పరిణామాల్లో అనూహ్యంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి బీఆర్‌ఎస్‌ను వీడి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. దీంతో రాజకీయ ప్రత్యర్థులు ఒకే గూటికి చేరినట్లయ్యింది. మంగళవారం బాన్సువాడకు వచ్చిన పోచారంను కాసుల బాల్‌రాజుతో పాటు ఆయన అనుచరులంతా వెళ్లి కలిశారు. ఒకరికొకరం సహకరించుకుంటూ మని పేర్కొన్నారు. దీంతో ఇంతకాలం రాజకీయంగా ప్రత్యర్థులుగా ఉన్న ఇద్దరు నేతలు ఒక్కటయ్యారని నియోజకవర్గ ప్రజలు మాట్లాడుకుంటున్నారు.



ఎమ్మెల్యే పోచారంను సన్మానిస్తున్న కాసుల బాలరాజు

కిం కర్తవ్యం?

బాన్సువాడ నియోజకవర్గంలో పోచారంను వ్యతిరేకించేవారంతా మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వెంట నడిచారు. పోచారంను చేర్చుకోవద్దంటూ హైదరాబాద్‌కు వెళ్లి మంత్రులు, నేతలను కలిసి విన్నవించారు. అయినా అధిష్టానం వారి అభిప్రాయాలను పక్కన పెట్టి పోచారంనకు కాంగ్రెస్ తీర్థం ఇచ్చింది. దీంతో ఇన్నాళ్లు పోచారంను వ్యతిరేకించిన వారి పరిస్థితి గందరగోళంలో పడింది. తాము వ్యతిరేకించిన నాయకుడు తమ పార్టీలోకే వచ్చారని, ఇప్పుడు ఆయనతో ఎలా కలిసి పనిచేస్తామని ప్రశ్నిస్తున్నారు. కాగా ఇటీవల ఏనుగు రవీందర్‌రెడ్డి పార్టీ శ్రేణులతో సమావేశమై తాను బాన్సువాడలోనే ఉంటానని, కార్యకర్తలకు అండగా నిలుస్తానని, ఎవరూ అధైర్యపడొద్దని పేర్కొన్నారు. పోచారం, కాసుల వర్గాలు కలిసిపోయిన నేపథ్యంలో ఏనుగు వర్గం దారెటు అన్న అంశంపై నియోజకవర్గంలో చర్చ నడుస్తోంది.

క్లుప్తంగా

జాతీయ రహదారిపై రాస్తారోకో

సదాశివనగర్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు న్యాయం చేయాలంటూ మండల శివారులోని జాతీయ రహదారిపై కాటేవాడ తండాకు చెందిన బాధిత కుటుంబాలు, తండావాసులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండల శివారులో సోమవారం హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపునకు వెళ్తున్న లారీ ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో గాంధారి మండలం కాటేవాడ తండాకు చెందిన రవీందర్ అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి దేవిసింగ్ హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఘటనకు కారకుడైన లారీ డ్రైవర్‌పై తగు చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని తండావాసులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబాలతో మాట్లాడి సముదాయించి రాస్తారోకోను విరమింపజేశారు. రాస్తారోకోతో జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలను పోలీసులు క్రమబద్ధీకరించారు.

ఉద్యోగ విరమణ చేయాల్సిందే..

- 65 ఏళ్లు నిండిన అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఆదేశాలు జారీ
- జిల్లాలో 282 మంది ఉద్యోగులు ఇంటి దారి



మోర్తాడ్: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పదవీ విరమణను రాష్ట్ర ప్రభుత్వం కఠినతరం చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి 65 ఏళ్లు పూర్తి చేసుకున్న వారు తప్పకుండా రిటైరవ్వాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లాలో 282 మంది ఉద్యోగులు ఇంటి దారి పట్టారు. జిల్లాలో 1,500 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో ఆయాల్లో అనేక మంది 70 ఏళ్లు దాటిన వారు, కార్యకర్తల్లో తక్కువ మంది 65 ఏళ్లు నిండినవారు ఉన్నారు. గతంలో పదవీ విరమణ అనేది లేదు. ఉద్యోగులు మరణించే వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పని చేస్తూ ఉండేవారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులకే కాకుండా ప్రైవేటు సెక్టార్ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ ఆప్షన్ ఉన్నప్పుడు అంగన్‌వాడీ ఉద్యోగులకు ఎందుకు వర్తింప చేయకూడదని చర్చసాగింది. ఇందులో భాగంగానే 65 ఏళ్లు నిండిన ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో కొత్తవారికి అవకాశం ఇవ్వాలని గత ఏడాది ప్రభుత్వాలు నిర్ణయం తీసుకున్నాయి.

గడిచిన 2021మార్చి31 నాటికే పదవీ విరమణ అంశాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నికల కోడ్, పలు కారణాలతో ఆ నిర్ణయం అమలు కాలేదు. దీంతో మూడు నెలలు పొడిగించారు. తాజాగా సోమవారం స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఉత్తర్వులను జారీ చేయడంతో మంగళవారం పదవీ విరమణ అమలులోకి వచ్చింది. ఇదిలా ఉండగా అంగన్‌వాడీ కార్యకర్తలు పదవీ విరమణ చేస్తే రూ.2లక్షలు, ఆయాలకు రూ.1లక్ష రిటైర్మెంట్ బెన్‌ఫిట్ ఇవ్వాలని గతంలోనే అసోసియేషన్ ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. అలాగే పింఛన్లు ఇవ్వాలని కోరారు. దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఉన్నతాధికారులు వెల్లడించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న వయస్సు పైబడిన ఉద్యోగులను తొలగించడంతో జిల్లాలో భారీగా ఖాళీలు ఏర్పడ్డాయి. త్వరలోనే ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఉత్తర్వులను అమలు చేశాం

పదవీ విరమణ విషయంలో ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేశాం. ఖాళీలు ఏర్పడటంతో వీటిని భర్తీ చేయడానికి త్వరలోనే నోటిఫికేషన్ జారీ చేసే అవకాశం ఉంది. రిటైర్మెంట్ బెనిఫిట్ విషయంలో ప్రభుత్వం ఏమైనా మార్పులు చేస్తే ఆ మొత్తాన్ని ఉద్యోగులకు అందిస్తాం.

– రసూల్ బీ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి

నిర్లక్ష్యపు హెచ్‌ఎం మాకొద్దు

- పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రుల ధర్నా
- తన విధుల కంటే ప్రైవేట్ పనులపైనే ఆసక్తి
- చిట్టీల పేరుతో గ్రామస్తులను ఒత్తిడికి గురిచేస్తున్న వైనం
- ఉన్నతాధికారులు పట్టించుకోవాలని గ్రామస్తుల వేడుకోలు



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఎడపల్లి: ప్రభుత్వ పాఠశాలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న హెచ్‌ఎం మాకొద్దు అంటూ మండలంలోని ఠానాకలాన్ గ్రామస్తులు, విద్యార్థులు తల్లితండ్రులు పాఠశాల ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హెచ్‌ఎం పాఠశాలకు సరైన సమయానికి రాక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

అంతేకాకుండా చిట్టీల వ్యాపారం పేరుతో విద్యార్థుల తల్లితండ్రులను మోసం చేస్తున్నాడని గ్రామస్తులు ఆరోపించారు. పాఠశాలలో గత 15 రోజుల నుంచి విద్యార్థులకు తాగునీటి సమస్య ఉన్నా పట్టించుకోవడం లేదని విద్యార్థులు ఇంటి నుంచే తాగునీటిని బాటిళ్లలో నింపుకొని వెళ్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ పనులపై ఆసక్తి చూపుతున్న హెచ్‌ఎం రూ.2 వేలు కడితే రూ. 50 వేలు వస్తాయని జనాలను నమ్మిస్తూ తన సమయాన్ని వ్యాపారం కోసం కేటాయిస్తున్నారని వారు పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రైవేట్ టీచర్లను గ్రామస్తులు నియమించి పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు పూనుకుంటే లేనిపోని సమస్యలు సృష్టించి వారిని పాఠశాలకు రాకుండా చేశాడని ఆరోపించారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ హెచ్‌ఎంను తొలగించాలని విద్యార్థుల తల్లితండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఆర్టీసీ లక్కీ డ్రా విజేతల ఎంపిక



డ్రా తీస్తున్న వరంగల్ ఆర్‌ఎం విజయభాను

హన్మకొండ: వరంగల్–నిజామాబాద్ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ఆర్టీసీ మంగళవారం లక్కీ డ్రా నిర్వహించింది. హన్మకొండ జిల్లా బస్టాండ్‌లో జూన్ నెలలో 15 రోజుల పాటు ప్రయాణించిన మహిళా ప్రయాణికులు తమ టికెట్లను బస్సుల్లో ఏర్పాటు చేసిన బాక్సుల్లో వేశారు. ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను లక్కీ డ్రా తీసి విజేతలను ప్రకటించారు. కరీంనగర్‌కు చెందిన జి.కవిత, చొప్పదండికి చెందిన దేవమణి, ఆర్మూరుకు చెందిన రత్న విజేతలుగా ఎంపికయ్యారు.

ఈ సందర్భంగా ఆర్‌ఎం విజయభాను, వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు మాట్లాడుతూ.. డీలక్స్ బస్సుల్లో ప్రత్యేక గిఫ్ట్ బాక్సులను ఏర్పాటు చేశామని, మహిళా ప్రయాణికులు బస్సు దిగేముందు తమ టికెట్ వెనుక పేరు, ఫోన్ నంబర్ రాసి ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేయాలని సూచించారు. ప్రతీ 15 రోజులకోసారి డ్రా తీసి, గెలుపొందిన మహిళా ప్రయాణికులకు బహుమతులు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఆపరేషన్స్ కేశరాజు భాను కిరణ్, అసిస్టెంట్ మేనేజర్ చిమ్మని సంతోష్ కుమార్, సిబ్బంది, ప్రయాణికులు పాల్గొన్నారు.







అ'పూర్వ' సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ ఉన్నత పాఠశాలలో 2003–04లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు అందరూ ఒకే చోట కలవడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఒకరి యోగా క్షేమాలను మరొకరు అడిగి తెలుసుకున్నారు. నాటి గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గురువులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రైల్వే ప్రయాణికులు జాగ్రత్తలు పాటించాలి



ఖలీల్‌వాడి: రైలులో ప్రయాణించే ప్రయాణికులు పలు జాగ్రత్తలు పాటించాలని రైల్వే ఎస్సై సాయిరెడ్డి మంగళవారం తెలిపారు. జిల్లా సరిహద్దుకు మహారాష్ట్ర ఉండటంతో రైళ్లల్లో ఎక్కువ దొంగతనాలు జరుగుతున్నాయని అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రయాణికులు తమ వెంట ఎక్కువ నగదు, బంగారు తీసుకెళ్లవద్దని సూచించారు. ట్రెయిన్ ఆగినపుడు డోర్ వద్ద నిల్చోవద్దని, కిటికీల వద్ద కూర్చున్నప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు.

క్రైం కార్నర్

పర్మిట్ రూంలో వ్యక్తి మృతి



వర్ని(మోస్రా): మండల కేంద్రంలోని దుర్గా వైన్స్ పర్మిట్ రూంలో బైరాగి శ్రీను(30) అతిగా మద్యం సేవించి మృతి చెందినట్లు వర్ని ఎస్సై కృష్ణకుమార్ మంగళవారం పేర్కొన్నారు. పెగడపల్లికి చెందిన శ్రీను మండలంలోని తిమ్మాపూర్‌లో మంగళవారం బంధువుల అంత్యక్రియల నిమిత్తం వచ్చి తిరుగు ప్రయాణంలో మోస్రా పర్మిట్ రూంలో అతిగా మద్యం సేవించి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ..



భిక్కనూరు: మండలంలోని బాగిర్తిపల్లికి చెందిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై సాయికుమార్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన మంద రమేశ్(29) ఇంటి నిర్మాణానికి బ్యాంక్‌లో ఆరు నెలల క్రితం రూ.2.40 లక్షలు, గ్రామంలో ఇతరుల వద్ద అప్పులు తీసుకున్నాడు. కొంత కాలం తర్వాత అప్పులు తీర్చడం భారంగ మారడంతో మదనపడుతూ గత నెల 27న ఇంటి నుంచి బయటకు వెళ్లి పురుగుల మందు తాగి ఇంటికి వచ్చాడు. నోటి నుంచి నురుగు రావడంతో కుటుంబీకులు వెంటనే రామాయంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య నవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..



దోమకొండ: మండల కేంద్రంలోని బస్టాండ్ మూల మలుపు వద్ద బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందారు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దోమకొండకు చెందిన చాకలి బాలు(45) గ్రామంలో మేస్త్రీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం రాత్రి ఇంటికి నడుచుకుంటు పాల ప్యాకెట్ తీసుకెళ్తుండగా బస్టాండ్ మూల మలుపు వద్ద ఆర్టీసీ బస్సు బాలును ఢీకొన్నది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందగా ఈ విషయం బస్సు డ్రైవర్ గమనించలేదు. ఆ ప్రాంతంలో చీకటి, మూల మలుపు ఉండడంతో ఆ బస్సు వెనుకాలే వచ్చిన మరో మూడు బస్సులు వెళ్లడంతో మృతదేహం ఛిద్రమైందని ఎస్సై పేర్కొన్నారు. సీసీ కెమెరాల ఆధారంగా కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

ఇసుక లారీల పట్టివేత

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని హజ్గుల్ మంజీరా క్వారీ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీలను పట్టుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి మంగళవారం తెలిపారు. క్వారీలో జీరో బిల్లులతో వందల లారీలలో ఇసుక నింపి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై గోపన్‌పల్లి చౌరస్తాలో లారీలను తనిఖీ చేశారు. పోలీసులు వస్తున్న సమాచారంతో క్వారీ నిర్వాహకుడు జాగ్రత్త పడి వేరే దారినుంచి లారీలను తరలించారు. పోలీసులు వెంటనే స్పందించి ఐదు ఇసుక లారీలను పట్టుకున్నారు. లారీలను మైన్స్ అధికారులకు అప్పగిస్తామని ఎస్సై పేర్కొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

డిచ్‌పల్లి: మండల పీఎస్ పరిధిలో జమీర్ అనే యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలానికి చెందిన బాలికతో మేస్త్రీ పని చేసే జమీర్‌కు 8 నెలల క్రితం పరిచయం ఏర్పడింది. నిందితుడు ఆమెను ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి పలుమార్లు అత్యాచారం చేశాడు. కొద్ది రోజులకు బాలిక గర్భం దాల్చింది. దీంతో నిందితుడు ఆమెకు చెప్పకుండా పారిపోయాడు. జూన్ 29న రాత్రి బాలికకు కడుపునొప్పి రాగా ఆమె తల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించింది. అదే రోజు రాత్రి బాలికకు ఆడశిశువు జన్మించింది. నెలలు నిండక పోవడంతో ఐసీలో ఉంచగా జూలై 1న సాయంత్రం శిశువు మృతి చెందింది. తనను పెళ్లిచేసుకుంటానని నమ్మించి గర్భవతిని చేసి మోసగించిన జమీర్‌పై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐపీసీ సెక్షన్ 376, పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. నూతన చట్టాలు అమలులోకి వచ్చినా ఘటన కొన్ని నెలల క్రితం జరిగినది కావడంతో పాత చట్టం ప్రకారమే కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో చోరీ



వివరాలు సేకరిస్తున్న ఎస్సై వంశీకృష్ణ

ఎడపల్లి: జానకంపేట శివారులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి దుండగులు చోరీకి యత్నించారు. వివరాలుఇ ఇలా ఉన్నాఇయ. ఆలయంలో దుండగులు సీసీ కెమెరాలను ధ్వంసం చేసి ఆలయానికి ఉన్న తాళాలు పగలగొట్టి హుండీని ధ్వంసం చేసే ప్రయత్నం చేశారు. అదే సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసు వాహనం సైరన్ చేసుకుంటూ వెళ్తుండడంతో దొంగలు భయపడి పారిపోయారు. మంగళవారం ఉదయం ఆలయ పూజారులు తాళాలు పగలగొట్టి ఉండటాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వంశీకృష్ణ వేలిముద్ర నిపుణులను రప్పించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి వేణు ఆధ్వర్యంలో గుడిలో ఉన్న హుండీలను తీసి డబ్బులు లెక్కించారు. పోలీసులు సకాలంలో పెట్రోలింగ్ నిర్వహించడంతో ఎలాంటి నగదు నష్టం జరగలేదన్నారు. ఆలయానికి సెక్యూరిటీ సిబ్బందిని నియమించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బోర్లం క్యాంప్‌లో..

బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంప్‌లో ఉన్న దుర్గమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అమ్మవారి విగ్రహానికి ఉన్న బంగారు కండ్లు, ముక్కుపుడక, కుంకుమ భరిణి, హుండీలోని నగదును దొంగిలించినట్లు ఆలయ నిర్వాహకుడు కాశ మల్లేశం తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐ కృష్ణ ఆలయానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆలయ నిర్వాహకుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ధర్పల్లిలో..

ధర్పల్లి: మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి, రేణుకా ఎల్లమ్మ ఆలయాలతో పాటు మండల శివారులోని మద్దుల్ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆలయాల గేటు తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఉదయం వచ్చిన పూజారులు పగులగొట్టిన తాళాలను గమనించి ఆలయ కమిటీలకు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలాలను పరిశీలించారు. ముందస్తు జాగ్రత్తగా ఆలయ కమిటీ వారు ఆలయాల్లో బంగారు ఆభరణాలను ఉంచకపోవడంతో ఆభరణాలు చోరీకి గురికాలేవని ఎస్సై పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, చుట్టుపక్కల సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

బోధన్‌రూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ మంగళవారం పేర్కొన్నారు. వివాహిత గత నెల 28న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. వివాహిత భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గోదావరిలో దూకేందుకు యత్నం

నవీపేట: మండలంలోని యంచ శివారులోని గోదావరి నదిలో మంగళవారం ఒకరు దూకేందుకు యత్నించగా యంచ గ్రామస్తులు కాపాడారు. నిర్మల్ జిల్లా బాసర సమీపంలోని మైలారం గ్రామానికి చెందిన నాగేశ్ కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది గోదావరి నదిలో దూకేందుకు యత్నిస్తుండగా గమనించిన యంచ గ్రామానికి చెందిన నారాయణ, సంతోష్, లింగంలు అతడిని కాపాడారు.

తండ్రీ కొడుకులకు విద్యుదాఘాతం

- తండ్రి మృతి, కుమారుడికి గాయాలు



భూమయ్య మృతదేహం


మాచారెడ్డి: పొలంలో లీకవుతున్న బోరు మోటారు పైపునకు బట్ట చుడుతుండగా విద్యుదాఘాతం సంభవించిన ఘటనలో తండ్రి మృతి చెందగా కాపాడబోయిన కుమారుడికి గాయాలైన ఘటన మండలంలోని లక్ష్మీరావుపల్లిలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పుట్ట భూమయ్య(45), ఆయన కుమారుడు ఆంజనేయులు గ్రామ శివారులోని పొలం వద్దకు వెళ్లారు. బోరు మోటారు పైపు లీకవుతుందని దానికి భూమయ్య బట్ట పీలిక చుడుతుండగా విద్యుదాఘాతం సంభవించి కిందపడిపోయాడు. తండ్రిని కాపాడే క్రమంలో ఆంజనేయులు సైతం కరెంట్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. వెంటనే తేరుకొని మోటారును బంద్ జేశాడు. కానీ అప్పటికే భూమయ్య మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కోస్లీ గ్రామంలో..

నవీపేట: మండలంలోని కోస్లీ గ్రామానికి చెందిన కంచరి రమేశ్(42) మంగళవారం సాయంత్రం విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ఈదురు గాలులకు లేచిన రేకుల ఇంటి పైకప్పును సరి చేస్తుండగా సర్వీస్ వైరు తెగి రేకులపై పడడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

3.30 కేజీల గంజాయి పట్టివేత

- నిందితులపై కేసు నమోదు



నిందితుడితో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రెండు వేర్వేరు కేసుల్లో 3.30 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ ఎక్సైజ్ పోలీస్ పరిధిలోని వేల్పూర్ వద్ద ఒక యువకుడు 210 గ్రాముల గంజాయితో పట్టుబడ్డాడు. నిందితుడిని గంజాయి ఎక్కడి నుంచి తీసుకు వచ్చావని అడిగితే ఆదిలాబాద్ జిల్లా భైంసాకు చెందిన ముజాయిద్‌ఖాన్ అనే వ్యక్తి నుంచి తీసుకు వచ్చినట్లు సమాచారం ఇచ్చాడు. ఈ సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ మెంట్ సీఐలు స్వప్న, వెంకటేశ్ సిబ్బందితో కలిసి పట్టుబడిన నిందితుడితో రెండు కిలోల గంజాయిని ఆర్డర్ చేయించారు. భైంసా నుంచి ముజాయిద్‌ఖాన్‌బెక్‌పై గంజాయిని తీసుకొచ్చాడు. ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులను చూసి బైక్‌ను అక్కడే వదిలేసి అడవిలోకి పారిపోయాడు. బైక్‌లో ఉన్న గంజాయిని తూకం వేయగా 2.10కిలో గంజాయిగా ఉంది. ఈ కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేయగా ఒక నిందితుడు పారిపోగా మరో నిందితుడు రిశ్వంత్‌ను అరెస్టు చేశారు. నిజామాబాద్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో కేసులో కిలో గంజాయిని ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు పట్టుకున్నారు. మొత్తం ముగ్గురిపై కేసు నమోదు చేశారు. నిందితుల నుంచి బైకులు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు గంజాయి కేసుల్లో సీఐలతోపాటు ఎస్సై నర్సింహచారి, ఉత్తమ్, భోజన్న, రాంబచన్ ఆశన్న, హమీద్, విష్ణు, అవినాశ్, మంజుల, సుకన్యలను, సిబ్బందిని డిప్యూటి కమిషనర్ సోమిరెడ్డి అభినందించారు.